క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ



వీపనగండ్ల: పసిపిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పంచాయతీ కార్యదర్శి విక్రమ్, పలువురు అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పసిపిల్లల తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు. పౌష్టికాహారాన్ని అందించడం, ఎత్తు, బరువులను గుర్తించడం, గర్భిణులు, బాలింతలకు వైద్యాధికారుల సూచనలు ఇప్పించడం లాంటి పనులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, మహేశ్వరి, సువర్ణ, కమల, ఎల్లమ్మ, ఆయాలు లచ్చమ్మ, నీరజ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పాదయాత్ర



అమరచింత: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావాలని కోరుతూ మండలంలోని చంద్రనాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు హనుమంతునాయక్ మంగళవారం మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టాడు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం నుంచి తొలిసారి బీసీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వస్తే వెనుకబడిన మక్తల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

మద్దలేశ్వరి బోనాల ఉత్సవం



అమరచింత: పట్టణంలో వెలసిన మద్దలేశ్వరి మాత ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలిబోనంతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పాట్టేళ్లను బలిచ్చి తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. పట్టణంలోని పద్మశాలీలు బోనం వెంట ఉంటూ అమ్మవారి నామంతో కూడిన కడ్గాలను చదువుతూ బోనం ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో బోనానికి పూజలు చేసి ప్రసాదాన్ని పద్మశాలీలకు పంపిణీ చేశారు. బుధవారం రెండో బోనం సమర్పణతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహంకాళి విష్ణు, కార్యదర్శి మహంకాళి ప్రభాకర్ గౌండ్లు, మేటి కాపులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు తడిసి మంగళవారం పట్టణంలోని సంజీవ్‌కాలనీలో నివాసముంటున్న భారతీయుడు, రాఘవేందర్, నర్సింహ, రామకృష్ణ నివాస గృహాలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ మండ్లరామకృష్ణ, చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు గృహాలను పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండకూడదని సూచించారు.

బైక్ ఢీని వ్యక్తికి గాయాలు



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని సుభాష్‌చౌరస్తాలో నిలబడిన వ్యక్తిని బైకు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన మంగదొడ్డి గొల్ల కుర్మన్న ఇంటి నుంచి మోపెడ్ వాహనంపై భార్యను ఎక్కించుకొని చౌరస్తాలో దింపి బైక్‌ను పక్కన పెట్టి నిలబడ్డాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వస్తూ ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో అతడికి రక్త గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు మంగదొడ్డి కుపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

బాబోయ్.. డెంగీ

- గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- ఆస్పత్రులకు పరుగులు
- స్వచ్ఛతపై దృష్టి సారించాలంటున్న ప్రజలు

పాన్‌గల్: మండల ప్రజలను డెంగీ భయాందోళనలు వెంటాడుతోంది. పదిహేను రోజుల వ్యవధిలోనే నలుగురికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు అధికారికంగా గుర్తించారు. మండలంలో లోపించిన పారిశుద్ధ్యంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు. మండలంలో అధికారికంగా డెంగీ కేసులు నలుగురే ఉన్నా అనధికారికంగా ఇంకా ఎక్కువే ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏ ఊరికి వెళ్లినా జ్వరాలతో బాధపడుతున్న వారే అధికంగా ఉన్నారు. వారంలో రెండుసార్లు డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణ మాత్రం మెరుగుపడటం లేదు. జిల్లా అధికారులు పర్యటించిన సమయంలో మినహా మిగతా సమయాల్లో దాని గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, బండపల్లి, శాగాపూర్, బుసిరెడ్డిపల్లి, మాందాపూర్, చింతకుంట, కదిరెపాడు, మంగళ్లపల్లి, పాన్‌గల్, కేతేపల్లి, వెంగళాయిపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

మండలంలో డెంగీ కేసుల నమోదు ఇలా..

రేమద్దులలో ఇద్దరు, తెల్లరాళ్లపల్లి, బండపల్లి గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున కేసులు నమోదయ్యాయి. ఈ గ్రామాల్లో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డెంగీ కేసులు నమోదైన కుటుంబ సభ్యులతో పాటు పరిసరాల్లో, అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తూ నివారణ చర్యలపై అవగాన కల్పిస్తున్నారు. డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో 325 మందికి రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు 145 మంది అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ పేర్కొన్నారు. దీంతో పాటు సబ్ సెంటర్ల పరిధిలో డెంగీ అనుమానితులతో పాటు మలేరియా అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించడం, పీహెచ్‌సీలో ప్రతి రోజు జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహిస్తున్న వారిలో అదనంగా డెంగీ కేసులు నమోదు కాలేదన్నారు.



రేమద్దులలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

మురుగు పారుతోంది



గ్రామంలో సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేక రోడ్లపైనే మురుగు ప్రవహించడంతో పాటు పలు కాలనీల్లో మురుగు నిల్వలు, వర్షపు నీటి నిల్వలతో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. దీంతో దోమలు వ్యాప్తి పెరిగింది. దీంతో రోగాలు సంభవిస్తాయోనని ఆందోళనగా ఉంది.

– మల్లేష్‌యాదవ్, శాగాపూర్

తాగునీరు కలుషితం



గ్రామంలోని తాగునీరు కలుషితం అవుతూ ఒండు నీరు సరఫరా అవుతున్నాయి. దీంతో పాటు కాలనీల్లో లోపించిన పారిశుద్ధ్యంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే గ్రామంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. పారిశుద్ధ్య నివారణ చర్యలతో పాటు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

– అంజనేయులు, రేమద్దుల

చర్యలు చేపడతాం

మండలంలో పారిశుద్ధ్యం లోపించి డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకుంటాం.

– గోవిందరావు, ఎంపీడీఓ

పారిశుద్ధ్య లోపంతోనే..



గ్రామాల్లో నిల్వ నీరు, పారిశుద్ధ్య లోపంతోనే దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగీ బారిన పడిన గ్రామాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి నివారణ చర్యలతో రోగాలకు దూరంగా ఉండొచ్చు. డెంగీ జ్వరాలు వచ్చిన గ్రామాల్లో ఆయా కుటుంబ సభ్యులతో పాటు పరిసరాల ఇళ్లలోని వారి నుంచి కూడా రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తూ.. నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రశేఖర్, పీహెచ్‌సీ డాక్టర్, పాన్‌గల్

ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

కొత్తకోట రూరల్: ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆశావర్కర్లను కేంద్ర ప్రభుత్వం 45, 46 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసును అమలు చేసి కార్మికులుగా గుర్తించడంతో పాటు ఖచ్చిత వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్య డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యను పరిష్కరించాలంటూ మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, కరోనా లాంటి మహమ్మారి కాలంలో కూడా తామంతా బయటకు వచ్చి ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలందించామన్నారు. తమ సేవలను డబ్ల్యూహెచ్‌ఓ, అంతర్జాతీయ సంస్థ గుర్తించి గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మంజుల, పుష్ప, సుజాత, దేవి, రేణుక, ఇందిరా, బుజ్జమ్మ, చంద్రకళ, కాంచన, మహేశ్వరి, శ్వేత, చంద్రకళ తదితరులు ఉన్నారు.



సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

గోపాల సముద్రంలో గంగమ్మతల్లికి పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ఉమ్మడి జిల్లాలో సప్తసముద్రాల్లో ఒకటైన పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ శివారులో గల గోపాలసముద్రాన్ని మంగళవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సందర్శించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. మూడు రోజులు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు గోపాల సముద్రం అలుగు పారుతున్న నేపథ్యంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గోపాల సముద్రం వద్ద గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలకు ఇబ్బంది పడుతున్న రైతులను, ఇళ్లు దెబ్బతిన్న ప్రజలను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. గ్రామాల్లో ఇబ్బంది ఎదుర్కొంటున్న వారిని గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిరాశ్రయులను పార్టీలకు అతీతంగా ఆదుకునేందుకు కృషి చేయాలని సూచించారు. మాజీ మంత్రి వెంట తాజా మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వేణుయాదవ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్, వనపర్తి మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సాంబయాదవ్, రఘువర్ధన్‌రెడ్డి, మల్లక్, సురేష్, ఆంజనేయులు, శ్రీధర్, గణేష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మాట్లాడుతూ రెండేళ్లుగా గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోర్‌మోటార్ కాలిపోయినా.. మరమ్మతు చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. 4, 5 వార్డుల్లో డ్రెయినేజీలు లేక మురుగు రహదారులపై ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రహదారులు పూర్తి స్థాయిలో లేవని, విద్యుత్ లోఓల్టేజీ సమస్య అధికంగా ఉందని వాపోయారు. మరుగుదొడ్లు నిర్మించుకుని రెండేళ్లు అవుతున్నా లబ్ధిదారులకు బిల్లులను చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫాగింగ్ చేపట్టి దోమలను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజి, కృష్ణయ్య, రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

అమరచింత: పెళ్లయిన రెండేళ్లకే అదనంగా కట్నం తీసుకురమ్మని నిత్యం వేధింపులకు గురిచేస్తున్న భర్త సచిన్‌సింగ్‌పై భార్య రక్షింద సింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన రక్షిందసింగ్‌ను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న సచిన్‌సింగ్‌తో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. ప్రస్తుతం అదనంగా కట్నం తీసుకురావాలని రక్షిందసింగ్‌ను భర్త వేధిస్తుండేవాడని ఎస్‌ఐ తెలిపారు. భార్య, భర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చినా మార్పు రాకపోవడంతో సచిన్‌సింగ్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు చేశామన్నారు.

బండపల్లిలో రక్త నమూనాల సేకరణ

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మహేష్ అనే వ్యక్తికి డెంగీ జ్వరం సోకడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు వారి ఇంటి పరిసరాల్లోని కుటుంబాలకు సంబంధించి రక్త నమూనాలను సేకరించామన్నారు. ఈ సందర్భంగా డెంగీ నివారణ, పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని, దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు.



డెంగీ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతి

వనపర్తి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామాలు, పట్టణాల్లోని విష జ్వరాలు, డెంగీ, మలేరియా తదితర జ్వరాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, దేవన్న, నిరంజన్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.సాయినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల నాలుగు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పారిశుద్ధ్యం లోపించిందన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన గ్రామీణ, పట్టణ ప్రజలు ప్రతి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు విష జ్వరాలకు, అతిసారా, మలేరియా, డెంగీ రోగాలకు గురై ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లోనే కాలం గడుపుతున్నారు.



డా.సాయినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు

వనపర్తి టౌన్: రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి దయనీయంగా మారిందని, హాస్టళ్లలో నాణ్యత లేని ఆహారం, నీళ్ల చారు, పురుగుల అన్నంతో గడిచిన ఏడు నెలల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లొండలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ముఖ్య కార్యకర్తలు పాల్గొని రాష్ట్రంలో ఉన్న సమస్యలపై చర్చించారన్నారు. పెండింగ్‌లో రూ.7,500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టంలో భాగంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినయ్, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాతర్ల అర్జున్

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ఖిల్లాఘనపురం: మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్బీ కానిస్టేబుల్ తెలుగు జానకీరాములు ఈ నెల 31న స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. అయనను మంగళవారం ఖిల్లాఘనపురం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, శ్రీనివాసులుతో పాటుగా స్టేషన్ సిబ్బంది ఆయనను సన్మానించారు. అనంతరం ఖిల్లాఘనపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ప్రతి ఒక్క ఉద్యోగికి బదిలీలు, ఉద్యోగ విరమణలు తప్పనిసరి అన్నారు. జానకీరాములు వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఆరేళ్ల ముందుగానే స్వచ్ఛందంగా పదవీ విరమణ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న కుటుంబ సభ్యుల నిర్ధారణ

అమరచింత: రుణమాఫీ కాని రైతుల వివరాలతో పాటు ఒకే రేషన్‌కార్డు కలిగిన రైతుల వివరాలను సేకరించే కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని మస్తీపురం, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో ఏఓ అరవింద్‌తో పాటు ఏఈఓలు ఆయా గ్రామాలను సందర్శించి రైతు కుటుంబ సభ్యుల వివరాలను బహిరంగంగా విచారించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టాపాస్ పుస్తకాలు వేర్వేరుగా ఉండి బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు ఒకే రేషన్‌కార్డు ఉండటం వంటి వ్యవహారాలతో పాటు రేషన్‌కార్డులో పేర్లు లేని రైతుల గురించి పూర్తిగా సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం చెపడుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగల్‌కడ్మూర్ లో విచారిస్తున్న ఏఓ అరవింద్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న బీసీ నాయకులు

వనపర్తిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిందని, గద్దెనెక్కి 8నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఒక్క రోజు నిరాహార దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేస్తామని చెప్పిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కాంగ్రెస్ పార్టీపై నిరసనగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ఒకరోజు నిరాహార దీక్షను చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముకుంద నాయుడు, సురేష్ యాదవ్, రవి గౌడ్, బాలు, జాఫర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పట్టణంలోని 9వ వార్డులో కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెసల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

వీపనగండ్ల: సీజనల్ వ్యాధులు నివారించేందుకు ప్రజలను పారిశుద్ధ్య పనులపై అప్రమత్తం చేయాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో హెల్త్ వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దయామణి, వైద్యులు హేమవర్ధన్, శ్వేత, భాగ్యశ్రీ, కరుణశ్రీ, హెచ్‌ఈ కేశవులు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి నిల్వనీటిని పారబోయడంతో పాటుగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, అధికారులు, వైద్య సిబ్బంది పనాల్గొన్నారు.

పాన్‌గల్: నిల్వ నీరు, పరిసరాల అపరిశుభ్రతతోనే రోగాలు సంభవిస్తాయని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, కొత్తపేట, మాధరావుపల్లి గ్రామాల్లో అధికారులు, వైద్య సిబ్బంది పర్యటించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఏఎస్‌ఎం సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం పొందుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మప్ప అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రతి మంగళ, శుక్రవారంలో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం పాల్గొన్నారు.



అమరచింతలో నిల్వ నీరు పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, స్పెషల్ ఆఫీసర్, సిబ్బంది



వీపనగండ్లలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్



మాధవరావుపల్లిలో..



ఖిల్లాఘనపురంలో..

కళాజాతా

పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెంలో కలెక్టర్ ఆదేశానుసారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీలు, సీజనల్ వ్యాధుల నివారణపై మంగళవారం కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, దోమ కాటు వాలన సంభవించే డెంగీ, మలేరియా రోగాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాకారులు వివరించారు.

బ్యాంకు వద్ద ఖాతాదారుల ఎదురుచూపులు

అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో మంగళవారం విద్యుత్ అంతరాయం కారణంగా కంప్యూటర్లు మొరాయించడంతో ఖాతాదారులు గంటల తరబడి బ్యాంకు ఎదుట నిల్చున్న పరిస్థితులు దాపరించాయి. రైతు రుణమాఫీ డబ్బులతో పాటు ఆసరా పెన్షన్ నగదును తీసుకోవడానికి వచ్చిన వినియోగదారులతో బ్యాంక్ పరిసరాలు కిక్కిరిపోయాయి. విద్యుత్ అంతరాయం కారణంగా కంప్యూటర్లు పనిచేయడం లేదని బ్యాంక్ సిబ్బంది గేట్ వేయగా.. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఖాతదారులు లావాదేవీల కోసం గంటల తరబడి ఎదురుచూశారు. మధ్యాహ్నం 1:30 నిమిషాలకు కరెంట్ రావడంతో యథావిధిగా బ్యాంక్ లావాదేవీలు జరిగాయని మేనేజర్ శివశంకర్ తెలిపారు.



బ్యాంకు ఎదుట గుమిగూడిన ఖాతాదారులు